## క్లుప్తంగా

### ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న గ్రామస్తులు

లోకేశ్వరం: మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామంలో శనివారం శ్రీపోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు భూమిపూజ నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి వీడీసీ నుంచి ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. సర్పంచ్ గంటగారి రమణారెడ్డి, నాయకులు భోజారాం, గంగాధర్, నర్సయ్య ఉన్నారు.

### ముత్యాల పోచమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీలో గల ముత్యాల పోచమ్మ 17వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయకమిటీ ఆధ్వర్యంలో శనివారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు జరిగే ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. ఆలయ కమిటీ సభ్యులు అంకం రాజేందర్, నాగేందర్‌రావు, రంజిత్‌రావు, గంగనర్సయ్య, రమేశ్, నాగరాజు, శ్రీనివాస్, నవీన్, మధు, రాజన్న, నర్సింలు, భీమన్న, రాములు, బాపన్న, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న బీజేపీ నాయకులు

నర్సాపూర్(జి): మండల కేంద్రానికి చెందిన ఆడెపు పెద్ద గంగాధర్ ఇటీవల మృతిచెందారు. బాధిత కుటుంబాన్ని శనివారం బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి పరామర్శించారు. అసెంబ్లీ కన్వీనర్ నాయుడి మురళి, జిల్లా కార్యదర్శి మిట్టపల్లి రాజేందర్, కొరిపెల్లి శ్రవణ్‌రెడ్డి, నరేందర్, అనుముల్ల శ్రవణ్, శైలేష్, రవినారాయణ, ప్రసాద్ పటేల్ తదితరులు ఉన్నారు.

### వరి పంటలు పరిశీలన

నర్సాపూర్(జి): మండలంలోని నర్సాపూర్ (జి), నసీరాబాద్, గొల్లమాడ, తిమ్మాపూర్(జి), నందన్ గ్రామాల్లో ఏవో జాదవ్ సాయి కిరణ్, క్లస్టర్ ఏఈవోలు గణేశ్, రమ్య, భాగ్యలక్ష్మి శనివారం వరి పంటల క్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు.

### మొక్కలు సంరక్షించాలి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి

కుంటాల: హరితహారంలో భాగంగా ఏర్పాటు చేసిన నర్సరీలోని మొక్కలను సంరక్షించాలని ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అంబకంటి తండాలో నర్సరీని శనివారం పరిశీలించారు. మొక్కలను బాధ్యతయుతంగా పెంచాలని సూచించారు. ఆయన వెంట సర్పంచ్ జాదవ్ శంకర్, పంచాయతీ కార్యదర్శి సతీశ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

### కంకరలోడ్‌తో వెళ్తున్న లారీ అడ్డగింత



లారీని అడ్డుకున్న గ్రామస్తులు

భైంసారూరల్: మండలంలోని కోతల్‌గాం గ్రామం మీదుగా కంకర లోడ్‌తో వెళ్తున్న లారీని శనివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. గతకొన్ని రోజులుగా చింతల్‌బోరి క్రషర్ నుంచి అధిక లోడ్‌తో కంకర లారీలు వెళ్తున్నాయన్నారు. అధిక లోడ్‌తో కంకర తీసుకువెళ్తున్న లారీలపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామస్తులు కిరణ్, రాజన్న, సాయినాథ్, రజినికాంత్, రాజు, అనిల్ ఉన్నారు.

# రాళ్లపై 'రాత'నాలు

- అక్షరాలా..కళాఖండాలు
- ముచ్చటైన శిలాఫలకాలు, నేమ్‌ప్లేట్లు
- అధునాతన సాంకేతికతతో ముందుకు
- ఏళ్లుగా వృత్తిలో కొనసాగుతున్న ఆర్టిస్టులు

**ఆదిమ కాలంలో మానవుడు తొలిసారిగా రాతిపైనే కొన్ని గుర్తులు రాశాడు. కాలగమనంలో చక్రవర్తులు, రాజులు సైతం తమ శాసనాలను రాతిపై చెక్కించేవారు. అప్పటి పాలకులు నిర్మించిన రాతి కట్టడాలపై శిల్పాలు చెక్కించేవారు. రాళ్లపై రాసిన రాతలు, శాసనాలు శతాబ్దాలుగా గడిచినా ఇప్పటికీ మనకు అందుబాటులోనే ఉన్నాయి.**



శిలాఫలకంపై అక్షరాలు చెక్కుతున్న కళాకారులు

నిర్మల్‌ఖిల్లా/గేట్: శిలలపై శిల్పాలు చెక్కి సృష్టికే అందాలు తెచ్చినవారు కొందరైతే.. రాళ్లపై అక్షరాలను రతనాలుగా మలిచి చెక్కుచెదరని జ్ఞాపకాలను పదిలపర్చుకునేలా చేస్తున్నారు నిర్మల్ కళాకారులు. మాటల్లో చెప్పలేని మధుర స్మృతులు, గత కాలపు వైభవాన్ని ఏళ్లపాటు చెరగని ముద్రలు వేసుకునేలా తీర్చిదిద్దుతున్నారు. ఆ వాక్యం స్ఫూర్తిమంతంగా నిలిచేదై ఉండొచ్చు. జీవన గమనాన్ని మలిచేది కావచ్చు. ఇలా ఎలాంటి జ్ఞాపకమైనా సమ్‌థింగ్ స్పెషలే కదా. అలాంటి మెమరీస్‌ను అందంగా పదిలపరుస్తోంది ఈ కష్ట జీవుల కళ.

**అధునాతన దిశగా..**

అందివచ్చిన అవకాశాలను ఆర్టిస్టులు సద్వినియోగం చేసుకుంటున్నారు. గతంలో గ్రానైట్ తీసుకొచ్చి దానిపై రాసి చిన్న చిన్న సుత్తితో పేర్లను చెక్కి అందంగా తీర్చిదిద్దేవారు. రానురాను విద్యుత్ ఉపయోగంతో తయారైన వివిధ రకాల పరికరాలను రాళ్లపై ఆర్ట్స్ వేస్తున్నారు. తొలుత గ్రానైట్ రాళ్లపై ఆర్ట్స్, బొమ్మలు, పేర్లు రాస్తుండగా..నూతనంగా ఇల్లు నిర్మించుకున్నవారు తమకు నచ్చిన వారి పేర్లతో 'నిలయం' రాయించుకునేవారు. కొందరు వివిధ బొమ్మలు గీయించేవారు. వీటికి అధికంగా గోల్డ్, సిల్వర్ రంగులు వేస్తున్నారు. తాజాగా స్టీల్ ఇచ్చింగ్ ప్లేట్స్ వస్తున్నాయి. ఇవి నేరుగా కంప్యూటర్ పేరు నమోదు చేసి ప్రింట్ ఇస్తున్నారు.

**చెరిగిపోవు..మరిచిపోం**

ఇంటికి అడిషనల్ అట్రాక్షన్ నేమ్‌ప్లేట్..సర్కారు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమ వివరాలు తెలిపేది. పెద్ద పెద్ద కంపెనీల ఓపెనింగ్ సెరిమనీలకు గుర్తుగా నిలిచేది శిలాఫలకం. ఏ వేడుకైనా తమకు స్పెషల్‌గా నిలిచిపోవాలని ప్రస్తుత జనరేషన్ కోరుకుంటోంది. దీంతో ఇటీవల రాళ్లపై అక్షరాలు చెక్కే కళకు గిరాకీ పెరిగింది.

**భిన్న భాషలు..విభిన్న డిజైన్లు**

వినియోగదారుల కోసం ఇక్కడ ప్రధానంగా పలు భాషల్లో అక్షరాలు చెక్కుతున్నారు. తెలుగు, ఉర్దూ, హిందీ, ఆంగ్లం, మరాఠీ తదితర భాషల్లో రాళ్లపై అక్షరాలను కళాత్మకంగా తీర్చిదిద్దుతున్నారు. సందర్భాన్ని బట్టి ఫలకాల డిజైన్‌ను ఎంచుకుంటారు. సమాధులపై ప్రతిష్ఠించే పలకలపై చతురస్రాకారంలో చిన్నచిన్నగా ఉంటాయి. మసీదుల ముందు ఏర్పాటు చేసేవి గోపురాన్ని తలపించేలా ఉంటాయి. ప్రారంభోత్సవాల్లో ఉపయోగించే పలకలు పొడవుగా పెద్దగా ఉంటాయి. ఇటీవల కంప్యూటర్ సహాయంతో తీసిన ఫొటోలను కూడా రాళ్లపై చెక్కుతున్నారు. అన్ని రంగుల్లో, వినియోగదారులు తమకు కావల్సిన పేర్లను, సైజులను ఒక కాగితంపై రాసి ఇచ్చేస్తే ధరను బట్టి వారు కోరుకున్న రంగుల్లో అక్షరాలు చెక్కి ఇస్తారు.

**ఉమ్మడి జిల్లాకు ఇక్కడి నుంచే..**

ప్రభుత్వ, ప్రైవేట్ ఇలా ఏ కార్యక్రమైనా.. ప్రారంభానికి ముందు, ప్రారంభం సమయంలో శిలాఫలకాలు వేస్తుంటారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఎలాంటి శిలాఫలకాలకు అయినా నిర్మల్ ఆర్టిస్టులే తయారు చేసి అందజేస్తున్నారు.

### 30 ఏళ్లుగా ఇదే వృత్తి



గత 30 ఏళ్ల నుంచి ఈ కళపై ఆధారపడి బతుకుతున్నాం. ఆర్డర్ ఇచ్చిన రెండు, మూడు రోజుల్లో డెలివరీ ఇస్తాం. వీటి ధరలు పరిమాణాన్ని బట్టి రూ.2,500 నుంచి రూ.10 వేల వరకు ఉన్నాయి. వందల ఏళ్లనాటి ఈ కళను ప్రభుత్వం ఆదరించాల్సిన అవసరం ఉంది.

– గాజర్ల నారాయణ, సంధ్య ఆర్ట్స్, ఆర్టిస్ట్

### ఆసక్తితో వచ్చాను



తొలుత ఆసక్తిగా ఈ వృత్తిని ఎంచుకున్నాను. 20 ఏళ్లకు పైగా ఈ వృత్తిలో ఉన్నా. శిలాఫలకాలు, వివిధ బొమ్మలు గీస్తూ ఆర్టిస్టుగా స్థిరపడ్డా. అందరికీ నచ్చేలా వినియోగదారుడు కోరిన విధంగా బొమ్మలు, పేర్లు రాయడం మూలంగా ఆదరణ ఇంకా కొనసాగుతూనే ఉంది.

– బ్రహ్మరౌతు అభిలాష్, నిర్మల్













వివిధ రకాల శిలాఫలకాలు జ్ఞాపికలు

### రైతుబజార్‌లో..

| కూరగాయలు | కిలో(రూ.లో) |
|---|---|
| టమాటా | 15 |
| వంకాయ | 40 |
| బెండకాయ | 40 |
| పచ్చిమిర్చి | 60 |
| కాకరకాయ | 50 |
| బీరకాయ | 60 |
| క్యారెట్ | 80 |
| గోరుచిక్కుడు | 60 |
| కొత్తిమీర | 100 |
| అల్లం | 50 |
| ఎల్లిగడ్డ | 50 |
| ఉల్లిగడ్డ | 20 |
| ఆలుగడ్డ | 25 |

- నిర్మల్‌టౌన్

### సినిమాలు





తిరుమల : మైఖేల్
నారాయణ : ధమాకా
వెంకటేష్ : వాల్తేరు వీరయ్య

### అగ్నిపథ్‌కు ఎంపికైన విద్యార్థికి సన్మానం



సన్మానిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

నిర్మల్‌ఖిల్లా/గేట్: నిర్మల్ రూరల్ మండలం ఎల్లాపల్లి పాఠశాలలో విద్యనభ్యసించిన దండ్ల సతీశ్ అగ్నిపథ్‌కు ఎన్నికయ్యాడు. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థికి శాలువా కప్పి సన్మానించారు. ఉపాధ్యాయులు కొరిపెల్లి పరమేశ్వర్‌రెడ్డి, జి.బాబు, ఎస్.బాపయ్య, ఎం.వాణి, లావణ్య పాల్గొన్నారు.

## కేసీఆర్ నియంతపాలనకు చరమగీతం పాడాలి



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు రాంనాథ్

ఖానాపూర్: సీఎం కేసీఆర్ నియంతపాలనకు వ్యతిరేకంగా ప్రజలు చరమగీతం పాడాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు రావుల రాంనాథ్ అన్నారు. మండలంలోని మస్కాపూర్‌లో పార్టీ మండల అధ్యక్షుడు టేకు ప్రకాశ్ అధ్యక్షతన జరిగిన మండల కార్యవర్గ సమావేశానికి శనివారం ఆయన హాజరై మాట్లాడారు. కేసీఆర్ మోసాలను పార్టీ శ్రేణులు ప్రజలకు వివరించాలన్నారు. ఏసీడీ పేరుతో చేసే అదనపు విద్యుత్ చార్జీల వసూళ్లపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతు ఆత్మహత్యలను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈనెల 10 నుంచి 20వ తేదీ వరకు శక్తికేంద్రాల మీటింగ్‌లు, బహిరంగ సభలు నిర్వహించి పార్టీ పటిష్టతకు కృషిచేయాలన్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలో వంద సభలు చేపట్టాలన్నారు. సమావేశంలో పెంబి జెడ్పీటీసీ బూక్యా జానుబాయి, నాయకులు పడాల రాజశేఖర్, పుప్పాల ఉపేందర్, చందుపట్ల శ్రావణ్, పెద్ది రమేశ్, మామిడాల సుధాకర్, ఇనుముల స్వామి, ఎనగందుల రవి, సువ్వుల రణవీర్, చుక్కబొట్ల శంకర్, పవన్, గిరి, రాజేందర్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## నిరసన తెలిపే హక్కు లేదా?



మాట్లాడుతున్న అరవింద్

నిర్మల్‌ఖిల్లా/గేట్: బీఆర్ఎస్ హయాంలో నిరసన తెలిపే హక్కు లేకుండా పోయిందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు సాదం అరవింద్ అన్నారు. జిల్లాకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నిర్మల్ పట్టణ మాస్టర్ ప్లాన్ రద్దుకు ఇటీవల చేపట్టిన ధర్నా కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేసి నాయకులను అరెస్టులు చేశారన్నారు. మంత్రి ఐకేరెడ్డి కబ్జాలు ఎక్కడ బయటపడతాయని భయపడి అరెస్టులు చేయించారన్నారు. బీజేపీ నాయకులు హైకోర్టును ఆశ్రయించి ధర్నాకు అనుమతులు తీసుకున్నామని అన్నారు. సోమవారం జరిగే ధర్నా కార్యక్రమానికి మాస్టర్ ప్లాన్‌లో భూములు కోల్పోతున్న రైతులు, బాధితులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి అల్లం భాస్కర్, దిలీప్, వడ్నాల రాజు పాల్గొన్నారు.

## మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు నమోదు



వాహనదారులకు సూచనలు ఇస్తున్న ట్రాఫిక్ ఎస్సై మల్లేశ్

నిర్మల్‌టౌన్: మైనర్లకు వాహనాలు ఇస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని పట్టణ ట్రాఫిక్ ఎస్సై మల్లేశ్ అన్నారు. ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో శనివారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. 65 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ట్రాఫిక్ ఎస్సై మాట్లాడుతూ నంబర్‌ప్లేట్లు తప్పుగా రాసిన, విరగొట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పట్టుబడ్డ వాహనదారులకు పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ ఎస్సైలు దేవేందర్, రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

## దిమ్మదుర్తిలో వనదర్శిని

నిర్మల్‌టౌన్: మామడ మండలం దిమ్మదుర్తిలో అటవీ సిబ్బంది శనివారం వనదర్శిని కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని మైనార్టీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి పర్యావరణ ప్రాముఖ్యత, ఎకో చైన్, ఫారెస్ట్ ఫైర్ ఇంపాక్ట్, ఎస్ఎంసీ వినియోగం, సహజ ట్రెక్కింగ్ తదితరాలపై అవగాహన కల్పించారు.

### అటెన్షన్ ప్లీజ్

## సీసీ రోడ్డు తవ్వకాలతో అవస్థలు



భైంసాటౌన్: పట్టణంలోని కిసాన్‌గల్లి, భట్టిగల్లి, పురా ఖబజార్ ప్రాంతాల్లో మిషన్ భగీరథ పనులు కొనసాగుతున్నాయి. పైప్‌లైన్ వేసేందుకుగాను సీసీ రోడ్డును తవ్వుతున్నారు. అయితే తవ్విన వెంటనే సీసీ రోడ్డు శిథిలాలు తొలగించకపోవడంతో ఆ రోడ్డుమీదుగా వెళ్తున్న వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు రోడ్డు దాటే క్రమంలో గాయాలపాలవుతున్నారు. శిథిలాలు తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

– అధికారి: పబ్లిక్‌హెల్త్ ఏఈ, నిర్మల్, సెల్: 95054 48184

## షర్మిల పాదయాత్రకు తరలిన నాయకులు



తరలివెళ్తున్న నాయకులు

ఖానాపూర్: వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల చేపట్టిన పాదయాత్ర వరంగల్ జిల్లాలో నర్సంపేటలో శనివారం పునఃప్రారంభమైంది. పలువురు ఖానాపూర్‌కు చెందిన పార్టీ నాయకులు తరలివెళ్లారు. కేసీఆర్ నియంత పాలనకు చరమగీతం పాడేందుకే షర్మిల పాదయాత్ర చేపట్టిందని నాయకులు అన్నారు. షేక్ అస్గర్, పానగంటి నరేశ్, ఎగుర్ల మహేశ్ తదితరులు ఉన్నారు.





## నిరుపయోగంగా భవనం

నిర్మల్‌రూరల్ మండలం చిట్యాల గ్రామంలో లక్షల రూపాయలతో మండల విద్యావనరుల కేంద్రం భవనాన్ని నిర్మించారు. రెండేళ్లు కావస్తున్నా అధికారులు ఇప్పటికి ప్రారంభించలేదు. దీంతో భవనం నిరుపయోగంగా మారింది. భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. కిటికీ అద్దాలు పగిలి ఉంది. మందుబాబులు తాగిపడేసిన మద్యం సీసాలు, సిగరెట్‌లు దర్శనమిస్తున్నాయి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

## ఆధ్యాత్మికం

### అబ్దుల్లాపూర్‌లో మల్లన్న జాతర



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

లోకేశ్వరం: మండలంలోని అబ్దుల్లాపూర్‌లో మల్లన్న జాతర శనివారం ప్రారంభమైంది. ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మల్లన్న దేవున్ని దర్శించుకున్నారు. మల్లన్న కల్యాణాన్ని వీడీసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని హత్‌గాం గ్రామంలో మల్లన్న దేవుడికి కల్యాణాన్ని అర్చకుడు నర్సింహస్వామి అధ్వర్యంలో జరిపించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ఊరేగింపులో పాల్గొన్న సభ్యులు

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 32వ ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేక కార్యక్రమాలు, స్వామివారికి విశ్వబ్రాహ్మణులు పూజలు చేశారు. అనంతరం స్వామివారి రథోత్సవం ఊరేగింపుగా స్థానిక బుధవార్‌పేట్ నుంచి గాంధీచౌక్ మీదుగా చింతకుంటవాడ తిరిగి ఆలయానికి చేరుకుంది. మహిళలు పెద్దఎత్తున పాల్గొని మంగళహారతులతో స్వాగతం పలికారు. ఆదివారం నిర్వహించే వీరబ్రహ్మేంద్ర స్వామి గోవిందమంబల కల్యాణాన్ని భక్తులు తరలిరావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. అనంతరం అన్నదానం ఉంటుందన్నారు. విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### నేడు మల్లన్న దేవుడి జాతర



మల్లన్న దేవుడి విగ్రహం

తానూరు: మండలంలోని ఎల్వి గ్రామంలోని మల్లన్న ఆలయం జాతరకు ముస్తాబైంది. ఆదివారం జాతర ఉత్సవాలు జరగనున్నాయి. ఉదయం ఆలయంలో పూజలు నిర్వహించి రాత్రి స్వామివారిని పల్లకీ నిర్వహిస్తారు. భక్తుల పూజలు అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు మల్లయోధులకు కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ పోటీలకు మండలంతోపాటు మహారాష్ట్రలోని పలు గ్రామాలకు చెందిన మల్లయోధులు హాజరై కుస్తీ పోటీల్లో పాల్గొంటారు. గెలుపొందినవారికి గ్రామకమిటీ సభ్యులు బహుమతులు ప్రదానం చేస్తారు.

### నేడు పెద్దమ్మ జాతర



ముస్తాబైన పెద్దమ్మ తల్లి ఆలయం

పెంబి: మండలంలోని మందపల్లిలో పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద జాతర మహోత్సవానికి ముస్తాబైంది. ఆదివారం జరిగే జాతరకు చుట్టుపక్కల నుంచే కాక జగిత్యాల, ఆదిలాబాద్ జిల్లాల నుంచి భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకుంటారు. భక్తులు కోరిన కోర్కెలు తీరినందుకు ఆ తల్లికి నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పిస్తారు. అనంతరం వారికి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు.

### విద్యార్థినులకు అవగాహన

నర్సాపూర్(జి): స్థానిక కేజీబీవీ పాఠశాల విద్యార్థినులకు శనివారం ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098పై అవగాహన కల్పించారు. . బాలికల హక్కులు, ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. ఎస్ఓ సునీత, సిబ్బంది గంగాభూషణ్ పాల్గొన్నారు.